**కథ**

# నమ్మకం

**"నాకో సహాయం చెయ్యాలి విన్నీ" ఇంటివాళ్ళ వాటాలోంచి ఫోన్ అటెండ్ అయి వచ్చిన స్వప్న కొంత తటపటాయిస్తూ అంది.**

**"చెప్పు. ఏం కావాలి. ఫోన్ ఇంటి నుంచేనా..అందరూ క్షేమమే కదా"**

''ఆ..అంతా కులాసాయే. అమ్మ ఫోన్ చేసింది ఏదో సంబంధం గురించి. వాళ్ళందరికీ నచ్చిందిట. ఆ అబ్బాయి రేపు హైదరాబాద్ వస్తున్నాడు.''

''అయితే నీకు పెళ్ళిచూపులు అరేంజ్ చెయ్యనా'' వినీత కొంటెగా నవ్వుతూ అడిగింది.

''చాల్లే చెప్పేది విను''

సంజీవ్ పెళ్ళి చేసుకోవాలనే అమెరికా నుంచి వచ్చాడు. స్వప్న ఫొటోలో అందరికీ నచ్చింది. సంజీవ్ స్టేట్స్ వెళ్ళకముందు పనిచేసిన కంపెనీలో కొంచెం పని ఉండడంతో హైదరాబాద్ వస్తున్నాడు. అలాగే స్వప్నని కలిసి కాసేపు మాట్లాడి ఓకే చేస్తే వాళ్ళ అమ్మా నాన్న ఏలూరు నుంచి తర్వాత వచ్చి లాంఛనప్రాయంగా స్వప్నని చూసి తాంబూలాలు పుచ్చుకుంటారు. పెళ్ళి పనులు మొదలుపెడ్తారు. సంజీవ్ పెళ్ళికి వస్తే సరిపోతుంది. అదీ వాళ్ళ ప్లాన్.

''రేపు ఎయిర్‌పోర్ట్‌కి నువ్వు వెళ్ళాలి అతన్ని రిసీవ్ చేసుకుందుకు'' స్వప్న మొహమాటపడుతూ అంది.

''నో ప్రాబ్లెం. అలాగే వెళ్తాను. నువ్వు పెళ్ళికూతుర్లా అలంకరించుకుని ఫ్రెష్‌గా అరవిరిసిన గులాబీలా ఉండాలి మేం వచ్చేసరికి'' వినీత ఉత్సాహంగా అంది.

''నేను చెప్పేది అర్థం చేసుకోముందు. రేపు పొద్దున్న అతను వస్తాడు. ఆఫీసులో..అతనికి పెద్దగా పనేం లేదు. ఓ ఇరవై నిమిషాల పని అంతే. మధ్యలో ఎప్పుడో వెళ్తాడు. మిగతా టైమంతా...''

''నీతోనే గడుపుతాడు. నేను పానకంలో పుడకలా రూమ్‌లో ఉండకూడదు..అంతేనా?''

''అబ్బా..అదేం కాదు. ముందు విను. నేను కాదు నువ్వు అతనితో టైం స్పెండ్ చేయాలి.''

''అమ్మాయ్ అతను వస్తున్నది నీకోసం. ఎయిర్‌పోర్ట్‌నుంచి రూమ్‌కి తోడ్కొని రావడం వరకూ ఒ.కే.''

''అది కాదే అమెరికా అబ్బాయి, అయిదేళ్ళుగా అక్కడ ఉంటున్నాడు. వాళ్ళవాళ్ళు మర్యాదస్తులే అనుకో..కానీ ఇతనెలాంటివాడో''

''అంటే నేను 'స్పై'గా మారాలా'' వినీత స్వప్న మాటల మధ్యలోనే అడ్డుకుంటూ అంది.

''ఓ రకంగా అంతే అనుకో. అతనితో కాస్త చనువుగా మూవ్ అయి అతని స్వభావం, గుణాలు గమనించు. నువ్వు మనుషుల్ని చాలా చక్కగా అంచనా వేస్తావు కూడా. నీ ఫ్రెండ్ కోసం ఆమాత్రం చేయలేవా?'' స్వప్న, వినీల మధ్య ఎం.సి.ఎ. చదువుతున్న ఈ రెండేళ్ళుగా ప్రగాఢమైన స్నేహం ఉంది. ఒకళ్ళ మీద ఒకళ్ళకి మంచి గౌరవం, ప్రేమ ఆప్యాయత ఏర్పడిపోయాయి.

''సరే చేస్తాను. కానీ అది సరైన మార్గం కాదు స్వప్నా. నువ్వు చేస్తున్నట్టు అతనూ నీ వివరాలు రహస్యంగా సేకరించడానికి ట్రై చేస్తే నువ్వెలా ఫీలవుతావు. ఇది మీ పెద్దవాళ్ళు చూస్తున్న సంబంధమేగా. వాళ్ళు అన్ని వివరాలు తెలుసుకునే ఉంటారు. అదీ కాకుండా ఈ అబ్బాయి బాబాయి మీ నాన్నగారి కొలీగ్''

''స్వప్నక్కా నీకు ఫోన్..'' ఇంటి వాళ్ళమ్మాయి లోపలికి తొంగి చూసి ఓ కేక పెట్టింది.

''వస్తున్నా'' స్వప్న గబగబా వెళ్ళి ఫోన్ అటెండ్ అయివచ్చింది.

''ఎవరే..'' పది నిమిషాల తర్వాత వచ్చి కుర్చీలో కూర్చున్న స్వప్నని అడిగింది వినీత.

''అతనే..సంజీవ్''

''యూమీన్..సంజీవ్ ఫ్రమ్ అమెరికా''

''ఊ..కానీ ప్రస్తుతం సంజీవ్ ఫ్రమ్ బెంగుళూర్''

''ఏమిటట..ఈ రాత్రి విరహ బాధని భరించలేను అన్నాడా?''

''షటప్..,నీకన్నీ నవ్వులాటలే..రేప్పొద్దున్న ఎయిర్‌పోర్ట్‌కి వస్తారా? ఎక్కడ కలుసుకోను అని అడిగాడు''

''స్వప్నా అతను నీ ఫొటో చూశాడు. ఇప్పుడు నీతో ఫోన్‌లో మాట్లాడాడు. నీ కంఠానికీ నా కంఠానికీ గాడిదకీ, గుర్రానికీ ఉన్నంత తేడా వుంది. అఫ్‌కోర్స్..అందులో గార్దభ స్వరం నాదే అనుకో. రేప్పొద్దున్న నేను ఎలా వెళ్తానే నేనే స్వప్నని అంటూ ఎయిర్‌పోర్టుకి..'' వినీత 'లా' పాయింట్ పట్టినట్టు సంబరపడిపోతూ అంది.

''నిన్ను స్వప్నలా వెళ్ళమని ఎవరన్నారు. వినీతలాగే వెళ్ళు'' స్వప్న చిరాగ్గా అంది.

''నీ ప్లాన్ ఏంటో నాకర్థం కావటం లేదు. కాస్త వివరంగా చెప్పు తల్లీ''

''రేపు నువ్వు వినీత..అంటే స్వప్న ఫ్రెండ్‌లాగే ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తావు. అతన్ని రిసీవ్ చేసుకుంటావు. స్వప్న ఐమీన్ నేను ఓ ఫ్రెండ్ నాన్న హఠాత్తుగా యాక్సిడెంట్‌లో పోవడంతో దానికి తోడుగా వాళ్ళ ఊరు వెళ్తాను. రాత్రికో, మర్నాడు పొద్దున్నకో వచ్చేస్తాను. ఇదే అతనితో చెప్పాల్సింది. ఆ తర్వాత అతనితో కలిసి తిరిగి స్వభావం, గుణాలు గమనించి రిపోర్ట్ తయారు చెయ్యి..దట్సాల్''

''బావుంది. ఏ ఫ్రెండ్ నాన్నకి ఎసరుపెట్టావే'' వినీత మూతి వంకరగా తిప్పుతూ అడిగింది.

''వనజ వాళ్ళ నాన్న..వద్దు. వద్దు..హేమంత. దానికెలాగూ వాళ్ళ నాన్న లేరు కాబట్టి దాని పేరు చెప్పు''

''ఒక్క మెతుకు ముట్టుకుంటే అన్నమంతా ఉడికిందో లేదో తెలుస్తుంది అన్నది రైటే అయినా ఒక్క పూటలో కాస్సేపు గడిపి మనిషిని పూర్తిగా అంచనా వెయ్యడం కుదరదు. అంచనా తారుమారయ్యే అవకాశం పుష్కలంగా ఉంది'' వినీత భుజాలు ఎగరేస్తూ అంది.

''అందుకే నువ్వు కాస్త మోడర్న్‌గా..ఐమీన్ డేషింగ్‌గా, డేరింగ్‌గా ఉండి అతనితో కాస్త క్లోజ్‌గా మూవ్ అయి అతని గుణగణాలు బయటికి లాగాలి'' స్వప్న 'అర్థం చేసుకో' అన్నట్టు చూసింది వినీతవైపు.

''ఆల్‌రెడీ నాకు బావ ఉన్నాడు. ఎంగేజ్డ్ కాబట్టి బతికిపోయావే..ఇంకెవర్తికైనా ఇలాంటి అవకాశం ఇస్తే నీ సంజీవ్ ఫ్రమ్ అమెరికాని ఎగరేసుకుపోయేది. ఏమయినా నీ ప్లాన్ నాకంత నచ్చలేదు స్వప్నా. అతన్ని నువ్వే గమనించి మాటల్లోనే అతని గుణగణాలు తెల్సుకోవచ్చుగా''

''మరే అడిగెయ్యగానే నేను సిగరెట్టు తాగుతాను బాటిల్స్ ఖాళీ చేస్తాను. అమ్మాయిలతో తిరుగుతాను అని ఎవరైనా చెప్తారా?'' స్వప్న వ్యంగ్యంగా అంది.

''నువ్వు నా నెత్తిన బరువైన బాధ్యత మోపుతున్నావు. నీ అంచనా తారుమారు అయితే నేను జీవితాంతం బాధపడాల్సి వస్తుంది'' వినీత అయిష్టంగా అంది.

''నిన్నేం అనరు ఎవరూ..మా అమ్మావాళ్ళు చూసిందేగా..ఏదో అవకాశం వచ్చింది కాబట్టి కాస్త తరచి అతని స్వభావం తెల్సుకుందామని'' స్వప్న కన్విన్స్ చేయడంతో వినీతకి 'ఊ' అనక తప్పలేదు.

★ ★ ★

వినీత ఎర్రగులాబి చేతిలో పట్టుకుని బెంగు



ఛూర్ ఫ్లైట్ నుంచి బయటికి వస్తున్న ప్యాసింజర్లని నిశితంగా గమనిస్తోంది. ఇందులో సంజీవ్ ఎవరై ఉంటారా అనుకుంటూ. వినీత బ్లూ జీన్స్, పైన పల్చగా ఒంటికి అతుక్కున్నట్టున్న టాప్ వేసుకుంది. పొట్టిగా ఉన్న జుట్టుని క్లిప్ పెట్టకుండా వదిలేసి కాస్త మేకప్ వేసుకుంది. మెడలో అమెరికన్ డైమండ్స్ పెండెంట్‌తో ఉన్న సన్నటి చైన్, చెవికి పెద్దరింగులు.

''హలో మీరు స్వప్నా..'' వినీత ఉలిక్కిపడింది. ఆలోచనలలోపడి అతన్ని గమనించనందుకు సిగ్గుపడింది ఓ క్షణం.

''హాయ్..నేను ఐయామ్ వినీత..స్వప్న ఫ్రెండ్'' చేతులు జోడించబోయి చటుక్కున అతని చెయ్యి లాగి షేక్‌హేండిచ్చి మెల్లిగా నొక్కింది.

''మీ ఫ్రెండ్ రాలేదా'' సంజీవ్ అటూ ఇటూ చూస్తూ అడిగాడు.

ఆరడుగులకి రెండంగుళాల తక్కువ ఎత్తులో, చామనఛాయలో పొడుక్కై తగ్గ బరువుతో హుందాగా ఉన్న సంజీవ్ స్వప్న అందానికి తగ్గ జోడీయే అనుకుంది వినీత.

''రండి వెళ్తూ మాట్లాడుకుందాం'' వినీత టాక్సీలో కూర్చున్నాక స్వప్న ఎందుకు రాలేదో ముందురోజు అనుకున్నట్టే చెప్పింది.

''తను చాలా ఫీలయింది మిమ్మల్ని రిసీవ్ చేసుకోలేకపోయినందుకు. రాత్రి వరకు మూడొంతులు వచ్చేస్తుంది. సారీ చెప్పమంది.''

''ఈరోజంతా ఫ్రీయే కదా..ఒకరి గురించి ఒకరు తెల్సుకోవడానికి మంచి అవకాశం అనుకున్నాను. నేను ఇక్కడ 'కృష్ణా' హోటల్లో ఉంటాను. మీ ఫ్రెండ్ వస్తే ఫోన్ చెయ్యమనండి. నా సెల్ నెంబర్ ఇదిగో''

''అయ్యయ్యో..హోటల్లో ఎందుకండీ..మా రూమ్ ఉందిగా. హోటల్లో మిమ్మల్ని దిగనిచ్చానంటే స్వప్న నన్ను తిట్టిపోస్తుంది. మా రూమ్ అంటే రెండు గదుల ఇల్లు. మీకేం ప్రాబ్లం ఉండదు. మీరు మా రూమ్‌కే వస్తున్నారు'' వినీత టాక్సీ డ్రైవర్‌కి తన ఇంటి ఎడ్రస్ చెప్పింది.

సంజీవ్ సామాను ఓ వారగా పెట్టింది వినీత. ''మీరు ఫ్రెష్ అవ్వండి. నేను కాఫీ, టిఫిన్ చేస్తాను''

''కాఫీ చాలండీ. మీకు శ్రమ ఇస్తున్నాను. మా ఆఫీస్‌కి వెళ్ళాలి నేను. అక్కడే ఏదో తీసుకుంటాను.''

''నో..నో..ఈరోజు మీరు మా అతిథి. నాకేం శ్రమలేదు. ఇవ్వాళ మాకు కాలేజీ పనీ లేదు'' వినీత మాట్లాడుతూనే గ్యాస్ స్టవ్ అంటించి ఒకదాని మీద పాలు పెట్టి ఇంకో దాని మీద ఉప్మా చెయ్యడం మొదలుపెట్టింది.

పది నిమిషాల్లో పొగలు కక్కుతున్న చిక్కటి కాఫీ, ఘుమ ఘుమలాడుతున్న ఉప్మా సంజీవ్‌కందించింది. సంజీవ్ టిఫిన్ తింటూ స్వప్న వినీత ఎన్నాళ్ళుగా కలిసి ఉంటున్నారో, వాళ్ళ చదువులు, హాబీలు అన్నిటి గురించీ వివరంగా తెల్సుకుంటున్నాడు. చదువు తర్వాత ప్లాన్స్ గురించి అడుగుతూ మృదువుగా, బిడియంగా మాట్లాడుతున్న సంజీవ్ మీద సదభిప్రాయం గౌరవం ఏర్పడిపోయింది.

'పూర్ స్వప్న..పిచ్చి పిచ్చి ఊహలతో ఇంత చక్కటి మనిషితో హాయిగా, జాలీగా గడిపే ఛాన్స్ పోగొట్టుకుంది' లోపల తిట్టుకుని మళ్ళీ సమాధానపడింది. 'జీవితాంతం ఇతనితో గడపుతుందిగా' అనుకుంటూ.

''మరి నేను వస్తాను. సాయంత్రం ఫోన్ చేస్తాను'' సంజీవ్ సామాను తీసుకుని వెళ్తానంటే వినీత

**చిట్టిపెద్ది ఉమ**

ఒప్పుకోలేదు. ''ఆగండి సంజీవ్‌గారూ..నేను కూడా వస్తాను''

''మీరెందుకండీ..నేను మా పాత ఆఫీస్‌కి వెళ్తాను. నాకు ఊరు తెలుసు''

''అబ్బె ఊరు తెలియదని కాదు. మీకు కంపెనీ ఇస్తాను. మీ పని అయ్యేవరకు నేను బయట వెయిట్ చేస్తాలెండి'' వినీత అంటూనే గబగబా హేండ్‌బ్యాగ్ అందుకుని గది తలుపు తాళం వేసింది.

ఆటోలో సంజీవ్ పక్కకి ఒదిగి కూర్చున్నా వినీత ఏదో గలగలా మాట్లాడుతూ ''ఫ్రీగా కూర్చోండి ఈ హైదరాబాద్ రోడ్లు ఎంత గతుకులూ..గోతులో చూశారా? మనిషిని కదలకుండా కూర్చోనివ్వవు. అమెరికా నుంచి వచ్చిన వాళ్ళకి ఈ రోడ్లమీద ప్రయాణం శిక్షే, ఏమంటారు?''

''మరీ..మీరు వర్ణిస్తున్నంత గతుకులు లేవేమో'' సంజీవ్ తన మీద పడ్తున్న వినీతకి తగలకుండా మరింత ఒదిగి కూర్చుంటూ అన్నాడు.

వినీత మొహం ఒక్క క్షణం వివర్ణమైనా ఇంత లోనే సర్దేసుకుంది. సంజీవ్ ఆఫీస్ పని ముగించు కున్నాక ఇద్దరూ కలిసి దగ్గర్లో ఉన్న బజార్లు చూసుకుంటూ భోజనానికి ఓ హోటల్‌కి వెళ్ళారు. సంజీవ్ ఇద్దరికోసం ఆర్డర్ చేశాడు.

''డ్రింక్స్ తీసుకుంటే నాకభ్యంతరం లేదు. నేను కంపెనీ ఇస్తాను'' వినీత వైపు కళ్ళు పెద్దవి చేసి చూశాడు సంజీవ్.

''అలా చూడకండి సంజీవ్‌గారూ..ఇండియా అమెరికాకేం తీసిపోలేదు. ఆడామగా భేదం లేకుండా కొన్ని అకేషన్స్‌లో సరదాగా డ్రింక్స్ తీసు కోవడం ఇక్కడా అలవాటుగా మారింది.''

''మీ ఫ్రెండ్‌కి అలవాటుందా?''

''అలవాటు కాదు నలుగురితో నారాయణా అంటూ కంపెనీ కోసం చాలా రేర్‌గా..జస్ట్ ఫార్మా లిటీ కోసం..''

''ఓహో..నాకలవాటు లేదు. మీకు కావాలంటే తీసుకోండి.''

''నో..నో..నాకూ అలవాటు లేదు'' వినీత, సంజీవ్ భోజనం చేస్తూ చాలాసేపు అక్కడే కబుర్లు చెప్పుకుంటూ కూర్చుండిపోయారు. వినీత అతని జాబ్, అమెరికన్ లైఫ్, ఫ్రెండ్స్ గురించి అక్కడి అలవాట్లు, వాతావరణం గురించి మాట్లా డుతూ చాలానే వివరాలు రాబట్టింది. మాట్లాడు తున్న కొద్దీ సంజీవ్‌మీద గౌరవం పెరుగుతోంది వినీతకి.

వినీత తన హ్యాండ్ బ్యాగ్ తెరచి సిగరెట్ ప్యాకెట్ లోంచి ఓ సిగరెట్ తీసి వెలిగించుకుని సంజీవ్‌కి ఆఫర్ చేసింది. సంజీవ్ రియాక్ట్ కాకుండా కూల్‌గా ఉండడానికి ప్రయత్నించి తనకి అలవాటు లేదని తిరస్కరించాడు. చాలా క్యాజువల్‌గా సిగరెట్ పొగ పీల్చి వదులుతున్న వినీతని ఏదో అడగాలని నోరు తెరచి మళ్ళీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

''స్వప్నకి అలవాటు లేదులెండి'' అతని మైండ్ చదివేసినట్టు గలగల నవ్వుతూ అంది వినీత. వినీత ఓసారి కాలేజీలో ఉండగా ఓ నాటకంలో అల్ట్రామోడర్న్ గర్ల్‌గా వేషం వేసింది. స్టేట్ లెవల్లో ట్రోఫీ గెలు చుకోవాలన్న తపనతో వినీత కష్టపడి సిగ రెట్ తాగటం దగ్గురాకుండా, విలాసంగా పీల్చడం నేర్చుకుంది. ఆ సంగతి తెలిసి ఇంట్లో అందరూ వినీత దుమ్ము దులిపే సారు. ఏమయితేనేం ఆఖరికి వాళ్ళ నాట కానికి ట్రోఫీతోపాటు, వినీతకి ఉత్తమ నటి అవార్డూ వచ్చాయి. ఆ తర్వాత మరె ప్పుడూ సిగరెట్ ముట్టని వినీత ఈరోజు మళ్ళీ స్వప్నకోసం సిగరెట్ వెలి గించింది.

''నేను బిల్ పే చేసి వస్తాను'' సంజీవ్ కౌంటర్ వైపు వెళ్ళగానే వినీత గబగబా 'ఎస్.ఎమ్.ఎస్' ఇచ్చింది స్వప్నకి 'త్వరగా రమ్మని. సంజీవ్ గుడ్‌గై' అని.

''ఇంక వెళ్దామా..మీ ఫ్రెండ్ ఎప్పుడు వస్తుందో..ఇందాకా నా కొలీగ్ ప్రకాష్ రాత్రి వాళ్ళిం టికి డిన్నర్‌కి రమ్మని మరీ మరీ చెప్పాడు. అతనికీ మధ్య పెళ్ళయింది. నేను సామాను తీసుకుని అక్కడికి వెళ్ళిపోతాను. స్వప్నగారు వస్తే రేపు ఫ్లైట్ టైంలోపల వీలుంటే కలుస్తాను.''

''ఒక్క క్షణం స్వప్నకి ఫోన్ చేస్తానుండండి. పన యితే వచ్చెయ్యమంటాను'' వినీత కంగారుగా లేవ బోతుంటే టేబుల్ మీద కప్పులో ఉన్న సూప్ డ్రెస్ మీద ఒలికింది. ''ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మి.'' వినీత రెస్ట్ రూమ్ వైపు నడిచి డ్రెస్ నీళ్ళతో క్లీన్ చేసుకుని వచ్చింది. వస్తూనే స్వప్నకి ఫోన్ చేసి మాట్లాడింది.

''స్వప్న ఓ అరగంటలో వస్తానంది. బహుశా మనం వెళ్ళేసరికి రూంలో ఉంటుంది. వెళ్దాం పదండి'' తను రెస్ట్‌రూమ్‌కి వెళ్ళినప్పుడు సంజీవ్ స్వప్నకిచ్చిన ఎస్.ఎమ్.ఎస్ చూశాడని వినీతకి తెలి యదు. సంజీవ్ తన అనుమానం కన్‌ఫర్మ్ చేసుకు న్నాడనీ తెలియదు. అనుకున్నట్టే వినీత, సంజీవ్ వెళ్ళేసరికి స్వప్న రూమ్‌లోనే ఉంది. సంజీవ్‌ని సాద రంగా ఆహ్వానించి పొద్దున్న కలుసుకోలేకపోయినం దుకు క్షమాపణ కోరింది. చాలాసేపు ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ గడిపారు.

''మరింక నేను ఉంటాను'' సంజీవ్‌ని ఎంత వారించినా వినకుండా సామాన్లు తీసుకుని ప్రకాష్ ఇంటికి వెళ్ళడానికి సిద్ధమైపోయాడు వాళ్ళు ఎదురు చూస్తూ ఉంటారు రాకపోతే బాధపడ తారు అంటూ. స్వప్నకి అతనితో ఇంకొంచెంసేపు గడిపితే బావుంటుంది అనిపిస్తోంది.

''రేపు మీ ఫ్లైట్ సమయానికి ఎయిర్‌పోర్ట్‌కి వస్తాను.'' స్వప్న చటుక్కున అనేసి మళ్ళీ ''రానా..రమ్మంటారా?'' అని అడిగింది. దీని జవాబుని బట్టి సంజీవ్ మనసు అర్థమైపోతుంది అనుకుంటూ.

''ఊ..'' సంజీవ్ కాసేపు తటపటాయించాడు. ''ఇప్పుడు కాసేపు మీరు నాతో రాగలరా?'' సంజీవ్ అలా అడుగుతోంటే స్వప్నమొహం ఒక్క సారిగా వెలిగిపోయింది.

''ఓ..యస్..నడవండి వెళ్దాం'' స్వప్న చెప్పులు వేసుకుని బయలుదేరింది. ట్యాంక్‌బండ్ మీద ఆటో దిగారు ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. ''ఐ లవ్ యూ.. ఐ లైక్ యూ.. నా వైపు నుంచి ఎస్. మీకభ్యంతరం లేదుగా'' అంటాడు అని ఊహల్లో తేలిపోతోంది స్వప్న.

సంజీవ్ ఎంతసేపటికీ లోకాభిరామాయణం తప్ప అసలు విషయానికి రాకపోతే స్వప్నకేం పాలు పోలేదు.''రేపు అమ్మావాళ్ళు ఫోన్ చేస్తే..ఓ.కే. చెప్తాను.'' స్వప్న సిగ్గుపడుతూ అంది.

''స్వప్నగారూ ఇక్కడ కూర్చుందామా'' సంజీవ్ ఓ బెంచీమీద కూర్చుంటూ అన్నాడు.

''మీకు కష్టం కలుగుతుందేమో నేను చెప్పబో యేది. కానీ చెప్పక తప్పదు. స్వప్నగారూ మీకు మనుష్యుల మీద నమ్మకం తక్కువ. అందుకే మీ ఫ్రెండ్‌ని నామీద ప్రయోగించారు. ఆ అమ్మాయి మీ అంత అందగత్తె కాదు కాబట్టి...అదీ ఆ అమ్మాయికి ముందే పెళ్ళి కుదిరిపోయింది కాబట్టి నాతో తిరగడానికి ఒప్పుకున్నదనుకుం టాను. ఒ.కే. అది వదిలేయండి. మీ కాబోయే భర్తని పరీక్షించాలనుకుంటే మీరే పరీక్షించి ఉండవ చ్చుగా. అంటే మీ ఎస్సెస్‌మెంట్ మీద మీకు నమ్మకం లేదు. ఇంకోటి మీకు మీ తల్లిదండ్రుల మీదా నమ్మకం లేదు. వాళ్ళు నా గురించి, మా ఫ్యామిలీ గురించి తెలుసుకునే ఉంటారు. కానీ మీరు వాళ్ళని కూడా నమ్మలేదు. పెళ్ళి 'నమ్మకం' అనే పునాది మీద నిలబడుతుంది. ఆ నమ్మకం లేన ప్పుడు..'అంటే ఏదో ఓ గోతిలో వెళ్ళి పడాలా' అనుకుంటున్నారేమో. తప్పులేదు. మీ జాగ్రత్తలో మీరు ఉన్నారు. కానీ నాకు మీ పద్ధతి నచ్చలేదు. మన స్వభావాలు కలవవు. వియ్ ఆర్ నాట్ ఫర్ ఈచ్ అదర్''

స్వప్న తన ఊహలు కలలు అన్నీ చెల్లాచెదురైపోతుంటే సంజీవ్‌తోపాటు ఆటో ఎక్కింది. సంజీవ్ స్వప్నని రూమ్ దగ్గర దింపేసి అదే ఆటోలో వెళ్ళిపోయాడు.

''కంగ్రాట్యులేషన్స్ స్వప్నా..ఏమ న్నాడు నీ రాకుమారుడు. అమెరికా ఇలా వెళ్ళి మళ్ళీ అలా పరిగెత్తుకు వస్తా నన్నాడా తన స్వప్నన్ని సొంతం చేసు కుని కలలు పండించుకోవడానికి..'' వినీత నవ్వుతూ అడుగుతుంటే స్వప్న మంచం మీద బోర్లాపడుకుండిపో యింది తలదిండు తడుస్తుండగా. ★

